క్లుప్తంగా

జోనల్ ఇన్‌చార్జిగా తొండమల్ల పుల్లయ్య


తొండమల్ల పుల్లయ్య

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు, కడప, తిరుపతి జిల్లాలకు రాష్ట్ర బీసీ కమిటీ జోనల్ ఇన్‌చార్జిగా తొండమల్ల పుల్లయ్యను నియమించారు. ఆయన ప్రస్తుతం రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేస్తు అదనంగా రాష్ట్ర బీసీ కమిటీలో మూడు జిల్లాలకు జోనల్ ఇన్‌చార్జిగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొడమల్ల పుల్లయ్య స్వగ్రామం గిద్దలూరు మండలం నరవ గ్రామం కాగా అతడు తిరుపతిలో వ్యాపారరీత్యా స్థిరపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆయన సేవలను గుర్తించిన టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆయనకు నాయీబ్రాహ్మణ చైర్మన్ పదవి దక్కడంతో పాటు రాష్ట్ర బీసీ కమిటీలో పనిచేసే భాగ్యం లభించిందని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయిబ్రాహ్మణులను ప్రత్యేకంగా గుర్తించిందని తెలిపారు.

ఎంఎల్‌సీకి ఘననివాళి

కొమరోలు: రహదారి ప్రమాదంలో మృతిచెందిన ఎంఎల్‌సీ సాబ్జి చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. ఎంఎల్‌సీగా ఉన్న సాబ్జి కారులో ప్రయాణిస్తున్న సమయంలో తూర్పు గోదావరి జిల్లాలో ప్రమాదవశాత్తు శనివారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల ప్రభుత్వ ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు రమణరెడ్డి, క్రిష్టారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంచలేదని ఫిర్యాదు

కురిచేడు: మండలంలోని పడమర గంగవరం గ్రామానికి చెందిన కోలా విజయకుమారి తన అత్త, చవితి కుమారులు తనకు ఆస్తి పంచటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌హెచ్‌ఓ చిన్నయ్య తెలిపిన వివరాల ప్రకారం కోలా విజయకుమారి పడమర గంగవరం గ్రామానికి చెందిన కోలా చిన్న వెంకటేశ్వరరావును రెండో వివాహం చేసుకుంది. వెంకటేశ్వరరావు భార్య చనిపోవటంతో విజయవాడకు చెందిన విజయకుమారిని వివాహం చేసుకున్నాడు. అయితే ఏడాది క్రితం చిన్న వెంకటేశ్వరరావు మృతి చెందాడు. వెంకటేశ్వరరావుకు ఇద్దరు కుమారులున్నారు. అతనికి ఉన్న ఇల్లు, పాక స్థలంలో విజయకుమారికి వాటా ఇవ్వమని, వెళ్లిపోవాలంటూ వెంకటేశ్వరరావు కుమారులు కోలా నారాయణ, ఏడుకొండలు, వెంకటేశ్వరరావు తల్లి వెంకటనర్సమ్మ గొడవ పెట్టుకున్నారు. దీంతో విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఐదుగురు జూదరుల అరెస్టు

గుడ్లూరు: కోడి పందేల స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మండలంలోని రామాపట్నం–కర్లపాలెం గ్రామాల మధ్య సముద్ర తీరం దగ్గర ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే. రామాయపట్నం–కర్లపాలెం గ్రామాల మధ్య కోడి పందేలు వేస్తున్న సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాదరెడ్డి తన సిబ్బందితో కలిసి దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని మూడు కోళ్లు రూ.3,500 నగదు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని కందుకూరు కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

వల్లూరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వల్లూరమ్మతల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. గోత్రనామార్చనల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వల్లూరమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

వరుస చోరీలతో హడలిపోతున్న రైతులు

కురిచేడు: మండలంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు వరుసగా చోరీలు జరుగుతుండటంతో రైతులు హడలిపోతున్నారు. తాజాగా మండలంలోని కాటంవారి పల్లె గ్రామంలోని పొలాల్లో సుమారు 10 మంది రైతులకు చెందిన లక్షరూపాయల విలువచేసే విద్యుత్ తీగ చోరీకి గురైంది. వారం రోజుల్లో మండలంలో బోధనంపాడు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి తీగను చోరీ చేశారు. దొంగలను పట్టుకోవాలని, రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు


రేగడపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు


విష్ణుసహస్రనామ స్తోత్రం పారాయణ చేస్తున్న మహిళలు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు అరుణ్‌కుమార్ స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం కల్యాణం, హోమాలు నిర్వహించారు. భక్తులతో విష్ణుసహస్త్రనామ పారాయణం చేయించారు. ఆలయ అధ్యక్ష్య కార్యదర్శులు రావిపాటి రామారావు, కార్యదర్శి నిట్టూరి వెంకటరమేష్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. రాత్రికి స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

శ్రవణా నక్షత్రం సందర్భంగా గుండ్లకమ్మ నదీ సమీపంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చక్కామాలకొండ నరసింహారావు, కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేగడపల్లిలో..

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకడు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారిని వెండి కిరీటాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కన్నుల పండుగలా అయ్యప్ప మహా పడిభజన


స్వామివారికి అభిషేకాలను నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


అయ్యప్పస్వామి పడి భజన సందర్భంగా పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: స్థానిక బూచేపల్లి నివాసంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిభజన కార్యక్రమం కన్నుల పండుగలా జరిగింది. అయ్యప్పస్వామి మాల ధరించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఇసుకవాగులోని ×సాక్షి రామలింగేశ్వరస్వామి॰ ఆలయంలో అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఊరేగింపుగా బూచేపల్లి నివాసంలో నిర్వహించే పడిపూజా భజన ప్రాంగణం వద్దకు తీసుకొచ్చారు. అయ్యప్పస్వామి మెట్లను సుందరంగా అలంకరించి స్వామికి బూచేపల్లి కుటుంబ సభ్యులతో పాటు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పడిపూజా భజన కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులతో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ భక్తిగీతాలను ఆలపించారు. భజన అనంతరం భక్తులకు బిక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివప్రసాదరెడ్డి సతీమణి బూచేపల్లి నందిని, వారి కుమారుడు, కుమార్తె, కుటుంబ సభ్యులతో పాటు సర్వమాలలు ధరించిన భక్తులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకుకు గిరాకీ

కురిచేడు: ఈ ఏడాది ఒక వైపు అనావృష్టి, అతివృష్టి నడుమ అన్నదాత అల్లాడి పోతున్నాడు. పంటలు పడక, పడిన పంటలు ఎదగక, ఎదిగిన పంటలు అతివృష్టికి కొట్టుకుపోయి నష్టపోతున్నాడు. బర్లీ పొగాకు ధర రైతుకు ఊరట నిచ్చింది. రైతుల వద్ద కొనుగోలు చేసిన పొగాకు గరిష్టంగా రూ. 15 వేలు పలికింది. దీంతో రైతుల ముఖాల్లో ఆనందం వ్యక్తమైంది. గత ఏడాది అత్యధికంగా క్వింటాలు రూ. 11500, సగటున రూ. 10500 వరకు ధరపలకగా, ఈఏడాది తొలిరోజు 30 శాతం పెరగటంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐటీసీ కంపెనీ మొదటగా ఆ ధరతో కొనగోలు ప్రారంభించగా మిగతా కంపెనీలు తప్పనిసరి పరిస్థితుల్లో అదే ధరకు కొనుగోలు ప్రారంభించాయి. ఈ ఏడాది బర్లీ పొగాకు పంట ఆశించిన స్థాయిలో దిగుబడులు రావన్న అంచనాతో మార్కెట్ ధరలు పెరిగినట్లు భోగట్టా. ఏది ఏమైనా పొగాకు ధర ఇలాగే స్థిరంగా ఉండవచ్చని రైతులు, వ్యాపార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.


పొగాకు బేళ్లను లారీకి ఎత్తుతున్న రైతులు

పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీవివేకానంద కళాశాలలో 1983–88 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థులు క్రిస్టమస్ సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రాచర్ల రోడ్డులోని మానసిక దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు ఆటవస్తువులు, దుప్పట్లు, స్వీట్లు, నిత్యావసర వస్తువులను అందజేశారు. పి.ఆర్.కాలనీలోని సంజీవని వృద్ధాశ్రమంలోని అనాథలకు, కొంగలవీడు రోడ్డులోని అమ్మ ఆశ్రమంలో నిరాశ్రయులకు వస్తువులు, దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తులసీబాబు, హనుమంతారెడ్డి, సునీల్, కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు నిత్యావసరవస్తువులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

డ్రాప్ ఔట్ విద్యార్థులను గుర్తించాలి

గిద్దలూరు రూరల్: డ్రాప్ ఔట్ విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలలకు పంపాలని జిల్లా బాలబాట డిప్యూటీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టెన్నిస్ కోర్టు ఆవరణలో ఆదివారం కార్డ్స్ బాలబాట అభివృద్ధి కార్యకర్తలకు నిత్యావసరవస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద వర్గాలకు చెందిన పిల్లలకు బాలబాట ఎంతో బాసటగా నిలిచిందన్నారు. డ్రాప్ ఔట్ విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలలకు పంపిస్తామన్నారు. గిద్దలూరు వైస్ ఎంపీపీ బండారి నోవెల్, పల్నాడు జిల్లా బాలబాట డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు, రాచర్ల ఏరియా కోఆర్డినేటర్ ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు, నిత్యావసర వస్తువులు అందిస్తున్న నిర్వాహకులు

నృసింహస్వామి ఆలయానికి వసతి గృహం

కురిచేడు: స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మి నృసింహస్వామి ఆలయానికి వసతి గృహాన్నిదాతలు నిర్మించారు. యర్రగొండపాలెం మండల కొలుకుల గ్రామానికి చెందినయక్కలి ఆదినారాయణ, ధలనలక్ష్మమ్మ దంపతుల పేరుమీద వారి కుమారులు యక్కలి బ్రహ్మం, అప్పారావు, పూర్ణ చంద్రరావు, పడిగేశ్వరరావు దానిని ఆదివారం ప్రారంభించి ఆలయానికి అప్పగించారు. లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నవితరణ నిర్వహించారు. సూరే సత్యనారాయణ, నాసరయ్య గుప్తా, రమేష్ పాల్గొన్నారు.


స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న వసతి గృహదాతలు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడికి నివాళి


నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఇస్మాయిల్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడు పెట్ల వాసు మృతదేహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ ఆదివారం నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ హర్షిత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

జరుగుమల్లి: మండల పరిధిలోని కామేపల్లిలో పోలేరమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృత అభిషేకం అనంతరం అమ్మవారి మూల విరాట్‌ని అర్చకులు శ్రీనివాస శర్మ పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న రాము తదితరులు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీలోని ప్రేమజ్యోతి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు నిర్మించిన భవనంలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శీలం రాము హాజరై కేక్ కట్ చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దళితుల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. దివ్యాంగులు మధుకృష్ణ, చుక్కా కిరణ్‌కుమార్, కొక్కిలిగడ్డ హనుమంతరావు, అల్లాభక్షు, శీలం ప్రవీణ్, శీలం ప్రభాకర్ పాల్గొన్నారు.

బెల్టుషాపుల నిర్వాహకులు అరెస్టు

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో బెల్టుషాపులపై దాడులు నిర్వహించి ఇద్దరినీ అరెస్టు చేశారు. వచ్చిన సమాచారం మేరకు నాళి కొండయ్య, పోలిచర్ల చెన్నమ్మలు అక్రమంగా మద్యం అమ్ముతున్నటు సమాచారం రావడంతో దాడి చేశారు. దాడిలో కొండయ్య వద్ద 10 బాటిళ్లు, చెన్నమ్మ వద్ద 7 బాటిళ్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై శివనాగరాజు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు


బేస్తవారిపేట: అలంకరణలో కోటా సత్యమాంబదేవి


మార్కాపురం టౌన్:అలంకారంలో పోలేరమ్మ తల్లి

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

రామాలయంలో..

ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా మండలంలోని పలు రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాములవారికి సహస్రనామార్చనలు, భక్తుల కీర్తనలతో పూజలు నిర్వహించారు. అర్చనల అనంతరం ప్రసాద నివేదన చేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలతోపాటు వేములకోట, సీతనాగులవరం, రామచంద్రపురం తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ సమీపంలోని నాగ శిలలు, పుట్ట వద్ద మహిళలు పూజలు చేశారు. ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

25 మంది విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ

మార్కాపురం రూరల్: క్రిస్మస్ పండగ సందర్భంగా మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో 25 మంది విద్యార్థులకు బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులు చర్చి ఆఫ్ క్రైస్ట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ సీహెచ్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీస్తు చూపిన మార్గంలో నడుస్తూ, సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

రేపు గొట్లగట్టులో సెమీ క్రిస్మస్ వేడుకలు

కొనకనమిట్ల: మండల రూరల్ ఇవాంజెలిస్ట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గొట్లగట్టు సియోను ప్రార్ధనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నిశనం ఇమ్మానియేల్, గొంగటి ఏలియా తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. సెమీ క్రిస్మస్ వేడుకల అనంతరం మండలంలోని 70 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు, వంద మంది పేద మహిళలకు చీరలు అందించనున్నట్లు తెలిపారు.


పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్

రాజానగర్‌లో పాము కలకలం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్‌లో ఓ నివాస గృహంలో నాగుపాము ఆదివారం కలకలం రేపింది. నాగుపాము ఇంటి పరిసరప్రాంతంలో కనిపించడంతో ఇంటి యజమాని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీశాఖకు చెందిన మౌలాలి, అశోక్ స్నేక్ క్యాచర్స్ ఇద్దరు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని చాకచక్యంగా నాగుపామును పట్టుకుని గోనె సంచిలో బంధించారు. అనంతరం పామును అటవీప్రాంతంలో వదిలేశారు.


నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్స్

భక్తిశ్రద్ధలతో మహానివేదన, గోపూజ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన కార్యక్రమం రుత్వికులు మంకాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

ఏపీటీఎఫ్ అధ్యక్షునిగా వేణుగోపాలరావు

గుడ్లూరు: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షునిగా కుంచాల వేణుగోపాల్ రావు ఎన్నికయ్యారు. స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ సమావేశం నిర్వహించారు. మండల నూతన కమిటీని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎస్.ఎన్ ప్రసాద్, అధ్యక్షులుగా కుంచాల వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గొర్ల కొండయ్య, ఉపాధ్యక్షులుగా యాసిన్ బాషా, రవీంద్రారెడ్డి, జ్యోతి, జిల్లా కౌన్సిలర్లుగా నాగేశ్వరరావు, జయంత్‌కుమార్, శ్రీదేవి, కార్యదర్శులుగా మాల్యాద్రి, చంద్రశేఖర్, సత్యమూర్తి, శారద, ఆడిట్ కమిటీ సభ్యులుగా మహేశ్వరి, మాధురిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జనిగర్ల శ్రీనివాసులు, గురునాథశర్మ, కుటుంబరావు పాల్గొన్నారు. మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు తెలిపారు.


ఏపీటీఎఫ్ మండలశాఖ సభ్యులు